ఉపాధి హామీ పథకం పనులు వారంలో పూర్తి చేయండి

అధికారులకు జిల్లా కలెక్టర్ సంతోష్ ఆదేశాలు

ఉపాధి హామీ పనులపై సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల, మార్చి 18 ప్రభాతవార్త : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను వారం రోజులలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉపాధి హామీ పనుల క్రింద చేపట్టిన సి.సి రోడ్ల నిర్మాణపు పనుల పురోగతిపై మండలాల వారిగా ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులలో పూర్తి నాణ్యత, పారదర్శకత పాటించడంతో పాటు, ప్రతి పనికి సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. మండలాల వారీగా పూర్తయిన పనుల జాబితా, ఎఫ్ టి ఓ జనరేషన్, పెండింగ్‌లో ఉన్నవి, పురోగతిలో ఉన్న పనులను నిర్దేశిత సమయంలో,ఎంబీ రికార్డింగ్, ఎఫ్ టి ఓ జనరేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పనిలో మెటీరియల్, లేబర్, మిషన్ వినియోగం వివరాలు స్పష్టంగా ఉండాలని, రోజువారీ పనుల నివేదికను సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అన్ని పనులకు సంబంధించిన ఎంబీ రికార్డింగ్ పూర్తయ్యాక వెంటనే ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేయాలనీ అన్నారు. స్వయంగా ఫీల్డ్ విజిట్ నిర్వహించి పనుల నాణ్యతను పరిశీలిస్తానని, నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పంచాయతీ రాజ్ ఈ.ఈ దామోదర్ రావు, డి.ఈలు, ఎ.ఈలు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

భూత్పూర్‌లో గుప్పుమంటున్న గంజాయి

- జోరుగా,గుట్టుగా నిషిద్ధ గుట్కాల విక్రయాలు
- చోద్యం చూస్తున్న పోలీస్,ఎక్సైజ్ అధికారులు

భూత్పూర్,మార్చి 18,ప్రభాతవార్త : యువతను పెడతోవను పట్టించి వారిని మత్తులో దించి దుర్మార్గం వైపు నడిపించే గుట్కాలు,గంజాయి విక్రయాలను కొందరు అక్రమార్జకులైన వ్యాపారస్థులు భూత్పూర్‌లో గుట్టు చప్పుడు కాకుండా విక్రయాలను జోరుగా నడుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.ఇట్టి అక్రమ వ్యాపారాలు సరాసరి రహదారులపై ఉండే పాన్‌డబ్బాలు,బడ్డీకొట్లు,టీస్టాల్స్‌లలో వ్యాపారస్థులు మూడో కంటికి తెలియకుండా విక్రయిస్తూ కొందరు వ్యాపారులు లక్షలు గడిస్తున్నట్లు కూడా విశ్వసనీయ సమాచారం.రహదారి కూడలిలో ఈ విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు కూడా తెలుస్తోంది.మత్తుపదార్థాలకు బానిసైన కొందరు యువకులకు ఇదొక వ్యసనంగా మారి యువత పెడదారి పడుతున్నట్లు వారి తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాన్‌గుట్కాలు,జర్దాలు యువతకు షరామామూలైనప్పటికి ఇటీవల కాలంలో భూత్పూర్‌లో గంజాయి అమ్మకాలు కూడా గుట్టుచప్పుడు కాకుండా జోరుగా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.ప్రత్యేకించి కొన్ని కిరాణాషాపులు,బడ్డీకొట్లు,పాన్‌డబ్బాలలో గంజాయి అమ్మకాలు గుట్టుగా అమ్మకాలు జరుగుతన్నట్లు తెలిసింది.గంజాయి దందా గడిచిన ఏడాది,రెండేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నట్లు సమాచారం.టీనేజ్ యువకులు ఈ మత్తుపదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నట్లు పలువురు మేధావులు,యువత తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైన సంబంధిత పోలీస్,ఎక్సైజ్ అధికారులు స్పందించి యువతను పెడదారి పట్టించే ఇలాంటి మత్తు పదార్థాల విక్రయాలను పసిగట్టి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు యువత తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిఎంశ్రీకి బున్యాదిపురం

పాఠశాల ఎంపిక

రెండు కంప్యూటర్లు, గేమ్స్ పరికరాలు ప్రారంభం చేసిన విద్యాధికారి

పిఎం శ్రీ పాఠశాల లో ప్రారంభిస్తున్న ఎంఈఓ జయరాములు

పెబ్బేరు,మార్చి18 ప్రభాతవార్త:పెబ్బేరు మండలం బున్యాదిపూర్ గ్రామం లో ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ లో భాగంగా ఎల్ కె జి, యూకేజీ తరగతులకు ఇండోర్ గేమ్స్ మెటీరియల్ మరి అవుట్ డోర్ గేమ్స్ మెటీరియల్,ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభోత్సవంచేసిన జడ్పీహెచ్ఎస్ రంగాపూర్‌కాంప్లెక్స్ ప్రధానఉపాధ్యాయులు పెబ్బేరు మండలవిద్యాశాఖ అధికారి జయరాములు ఈప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పీఎం శ్రీ పాఠశాలలో భాగంగా బున్యాదిపురం పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను గ్రామం లోని అందరు విద్యార్థులు వినియోగించుకొని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రైవేటు పాఠశాల కన్నా దీటుగా విద్య బోధన చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ శేషు, ఉపాధ్యాయులు దయానంద్ దొడ్ల, మౌనిక పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణకు

పక్కా ఏర్పాట్లు

60 కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకానున్న 10,598 మంది విద్యార్థులు విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు వీలుగా ఏర్పాట్లు డీఈఓ రమేష్ కుమార్

డీఈఓ రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ ఏ.రమేష్ కుమార్ తెలిపారు. మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ వివరించారు. పది పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 60 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు.

ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. 45ఏ క్యాటగిరి సెంటర్లు, 9బీ క్యాటగిరి సెంటర్లు, 6సి క్యాటగిరి సెంటర్లలో కస్టోడియన్ పర్యవేక్షణలో పేపర్లు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేశామన్నారు. మరోవైపు విద్యార్థులకు తరగతుల నిర్వహణ ఇప్పటికే పూర్తి చేశామన్నారు. పునశ్చరణ తరగతులు సైతం పూర్తి చేశామని చెప్పారు. ఒత్తిడి లేకుండా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేశామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశాం. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు సాగుతాయి. ఎస్సెస్సీ బోర్డు నుంచి వచ్చిన ప్రశ్న పత్రాలను సంబంధిత పరీక్షా కేంద్రాల పరిధిలోని పోలీస్‌స్టేసన్లలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. జిల్లాలో పోలీస్‌స్టేషన్‌లు, పోస్ట్ ఆఫీస్‌లు అందుబాటులో లేని 6సి గ్రేడ్ కేంద్రాల పేపర్లు సమీప మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో భద్రపరచి పరీక్షల సమయంలో కారు బందోబస్తు మధ్య కస్టోడియన్ అధికారుల సమక్షంలో వాటిని కేంద్రాలకు చేరుస్తారు. అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది పది పరీక్షలకు 10,598 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో 10,553 మంది రెగ్యులర్ కాగా, 45 మంది విద్యార్థులు ప్రైవేటు పరీక్షలకు హాజరవుతున్నారు. అందులో 5273 మంది బాలురు, 5325 మంది బాలికలు ఉన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షల సమయానికంటే 30 నిమిషాలు ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 5 నిమిషాల ఆలస్యాన్ని అనుమతించడం జరుగుతుందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని, ప్రతి పరీక్ష కేంద్రంలోని రూముల్లో గాలి, వెలుతురు ఉండేలా లైట్లు ఫ్యాన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. త్రాగునీటితోపాటు విద్యార్థులకు ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రతి పరీక్ష కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి ఏఎన్ఎం, ఆశ వర్కర్ల తో పాటు ప్రథమ చికిత్సకు అవసరమైన వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా సమయాలకు సకాలంలో హాజరయ్యే విధంగా ఆయా రూట్‌లలో నడిచే బస్సులు ఉదయం ఏడు గంటల నుంచే బస్సులు తిరిగేలా ఆర్టీసీ ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులు పది పరీక్షలకు సకాలంలో హాజరై ఒత్తిడి లేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు రాసేందుకు జిల్లా విద్యాశాఖ పరీక్షల ఎల్లవేళలా సంసిద్ధంగా పనిచేస్తుందని డీఈఓ రమేష్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

ఆరు నెలలుగా

ఈసీజీ సేవలు బంద్

వెల్ నెస్ సెంటర్‌లో సేవలు నిల్

అవస్థలు పడుతున్న జర్నలిస్టులు,రిటైర్డ్ ఉద్యోగులు



మహబూబ్‌నగర్ వెల్నెస్ (ఇన్‌సిట్లో) నిరుపయోగంగా ఉన్న ఈసీజీ మిషన్

మహబూబ్‌నగర్‌బ్యూరో, మార్చి 18 ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగులు జర్నలిస్టులకు ఆరోగ్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్నెస్‌సెంటర్లలో మందుబిల్లలు తప్ప పరీక్షలు చేయడం లేదు.వైద్యంకోసం వచ్చే వారికి సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు.మందు గోళీలు ఉంటే పరీక్షలు ఉండవు,పరీక్షలుచేస్తే గొరీలు ఉండవు అన్నట్లు తయార యింది వెల్నెస్ సెంటర్ పరిస్థితి.ఒక డాక్టరు ఉంటే ఇంకొక డాక్టర్ ఉండదు. గత ఆరునెలలుగా ఈసెంటర్లో వయసు మారిన వృద్ధులకు గుండెపరీక్షలు చేసే పరికరాలు పనిచే యడం లేదు.రోజుకు150మందికి పైగా పరీక్షలు చేయిం చుకునే వారు. ఈసీజీ సేవలు నిలిచి పోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మొదటి అంతస్తులో సేవలు..

మహబూబ్‌నగర్ వెల్నెస్‌సెంటర్‌ను పాత డిఎంహెచ్ఓ కార్యాలయంలో కొనసాగిస్తున్నారు.మొదటిఅంతస్తులో వైద్య సేవలు అందిస్తుండడంతో వృద్ధులు పైకి ఎక్కలేక నరక యాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవలసిన పట్టించుకోవడం లేదు. మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తుందని వృద్ధాప్యంలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే కనీసం వైద్యం కూడా అందడం లేదని రిటైర్ ఉద్యోగుల ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్ స్పందించి వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టులు కోరుతున్నారు.

భవిత సెంటర్లలో ప్రత్యేక శిక్షణ : కలెక్టర్

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ

పరికరాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 18 ప్రభాతవార్త: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కొరకు భవితా సెంటర్లు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నామని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో సమగ్ర శిక్ష అలింకో వారు సంయుక్తంగా దివ్యాంగ విద్యార్థుల కొరకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబ్నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలుగల విద్యార్థుల కోసం భవితా సెంటర్లలో ప్రత్యేకమైనటువంటి శిక్షణను ఇస్తున్నామన్నారు. దీనిని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకొని తమ యొక్క విద్యార్థులను కచ్చితంగా భవిత సెంటర్‌కు పంపించి వారికి కావలసిన జీవన నైపుణ్యాలను నేర్పించుకోవాల్సిందిగా తెలియజేశారు. ఇక నుండి వారానికి రెండు సార్లు భవితా సెంటర్లలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తామన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఏ విషయంలో కూడా తక్కువ కాదని వారికి ప్రత్యేకమైనటువంటి నైపుణ్యాలు పుట్టకతోనే వస్తాయని వారిలో గల సృజనాత్మకతను నైపుణ్యాలను గుర్తించి వెలికి తీస్తే వీరు చాలా ప్రతిభావంతులుగా మారుతారని తెలిపినారు. జీవితంలో సరైన శిక్షణ ఇస్తే వారు కూడా మంచి స్థానంలోకి వెళతారని ఈ సందర్భంగా ఐఆర్పిలకు కలెక్టర్ సూచించారు. గత ఆగస్టులో నిర్వహించిన అసెస్మెంట్ క్యాంపులో నుండి 183 మంది విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సుమారు రూ.16 లక్షల విలువైన సహాయ ఉపకరణాలను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కాలిపర్స్, వినికిడి యంత్రములు, ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, సిపి చైర్స్, ఎంఆర్ కిట్స్, రొలేటర్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భవితా సెంటర్లలో చదివే విద్యార్థులకు ఎన్టెటిల్మెంట్స్ స్టైఫండ్ ఎస్కార్ట్ అలవెన్సు రీడర్ అలవెన్స్ ఇస్తున్నామని, భవితా సెంటర్లలో వారానికి రెండుసార్లు ఫిజియోథెరపీ క్యాంపు స్పీచ్ థెరపీ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. పదవ తరగతి పరీక్షలలో కూడా ఈ విద్యార్థులకు ప్రత్యేకమైన సౌకర్యాలు కలవని వాటిని ఉపయోగించుకొని ఆయా పరీక్షలలో సులభంగా ఒత్తిడులు కావచ్చని తెలిపినారు దివ్యాంగ కారణం చేత ఏ విద్యార్థి కూడా పాఠశాలకు దూరం కాకూడదని ఈ సందర్భంగా తెలిపినారు. విలీన విద్య సమన్వయకర్త మరియు సమగ్ర శిక్ష సీఎంవో బైకని బాలు యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రతి సంవత్సరం సమగ్ర శిక్ష అలింకో ఆధ్వర్యంలో అసెస్మెంట్ క్యాంపు నిర్వహించి విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైనటువంటి ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష దుంకుడు శ్రీనివాస్, మహబూబ్‌గర్ అర్బన్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ సింగ్, ఐఆర్పిలు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించాలని

సీఎంకు వినతిపత్రం

సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

నారాయణపేట టౌన్,మార్చి18 ప్రభాతవార్త: కోటకొండ, గార్లపాడు గ్రామాలను మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.గుమ్మడి నరసయ్య మాజీ ఎమ్మెల్యే, పేట జిల్లా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ - మిగతా4లో..

సమన్వయంతో పనిచేస్తున్న సహాయక బృందాలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

సహాయక చర్యల్లో సిబ్బంది

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త: డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, మంగళవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోని ప్రమాదం సంభవించిన ప్రదేశంలోకి ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు మంగళవారం ఉదయం కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్ టన్నెల్‌లోకి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై సహాయక బృందాల ఉన్నతాధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యల వేగవంతానికి పలు సూచనలు చేసినట్లు వివరించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ యొక్క ఫ్లాట్‌ఫాం భాగాలని తత్తిరించే పనులు వేగంగా జరుగుతున్నాయని, సమాంతరంగా టి బిమ్ పై నున్న మట్టిని తొలగించే పనులు రెట్టింపు వేగంతో సహాయక బృందాలు పూర్తిస్థాయిలో 24 గంటలు సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. టిబిఎంను కత్తిరించిన భాగాలను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ,లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపిస్తున్నట్లు ,మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. సహాయక బృందాల వారీగా సహాయక చర్యలు చేపడుతూ,సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని, తెలియజేశారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) అధికారులు టన్నెల్ ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించి, భూగర్భ నిర్మాణం, భూస్థాయిల మార్పులు, టన్నెల్ మట్టిపెళుసు స్థితి, నీటి ప్రవాహం, ప్రభావం, వంటి అంశాలపై అక్కడి భూగర్భ పరిస్థితులను విశ్లేషించారు. అధ్యయనం అనంతరం, వారు సహాయక చర్యలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారని, ప్రభుత్వ అధికారులు, రక్షణ సిబ్బంది, ఇంజినీర్లు, జియోలాజిస్టులు అనుభవజ్ఞులైన రెస్క్యూ టీమ్‌లు సమన్వయంతో పని చేస్తున్నట్లు వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలు, డ్రిల్లింగ్ మెషిన్లు, సెన్సార్లు, రోబోటిక్ పరికరాలు వంటి సాధనాలను వినియోగించి సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగం, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, ఆర్మీ, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్,ర్యాట్ హోల్ మైనర్స్,కడావర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్,దక్షిణ మధ్య రైల్వే, జిఎస్ఐ, జలవనరుల శాఖ, ఇతర సంబంధిత విభాగాలు ఒకటిగా పని చేస్తూ సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

యాసంగి పంటలు ఎండిపోకుండా

తగిన చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ ఆదర్శ్ సురభి

వ్యవసాయ పొలాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

వనపర్తి రూరల్, మార్చి 18 ప్రభాతవార్త: జిల్లాలో యాసంగి పంటలు ఎండిపోకుండా ఉండేందుకు రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా అందించడమే కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం తాండ పరిధిలో ఇటీవల ఎండిపోయిన వ్యవసాయ పొలాలను పరిశీలించారు. మొత్తం ఎన్ని ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని జిల్లా వ్యవసాయ అధికారిని ఆరా తీయగా, 36 మంది రైతులకు చెందిన 45 ఎకరాల వరకు పంట ఎండిపోయినట్లు చెప్పారు. స్థానిక రైతులు మాట్లాడుతూ తామంతా బోరు బావుల పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నామని, విద్యుత్ సరఫరాలో సమస్యల కారణంగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తమను ఆదుకోవాలని కలెక్టర్ కు విన్నవించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగిలో పంట వేసిన రైతుల పంటలు ఎండిపోకుండా బోరు బావుల ద్వారా నీరు అందించేందుకు సరిపడా విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈని ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని తప్పనిసరిగా పంటకు నీరు అందించేందుకు, సరిపడా విద్యుత్ సరఫరా చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా కొత్తగా విద్యుత్ స్తంభాలు వేయించేందుకు అటవీ శాఖ నుంచి అభ్యంతరం ఉన్న నేపథ్యంలో దానికి సంబంధించిన పూర్తి వివరాలు నివేదిక పంపాలని దానికనుగుణంగా కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి సంబంధిత ప్రాంతంలో రైతులందరికీ విద్యుత్ సౌకర్యం కల్పించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పనుల పరిశీల నవనపర్తి మండల పరిధిలోని తిరుమలయ్య గట్టు ప్రాంతంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో ఏ పనులు చేపిస్తున్నారని కలెక్టర్ ఆరా తీయగా, నీటి గుంతలు తీయించే పనులు చేయిస్తున్నట్లు డిఆర్డిఓ బదులిచ్చారు. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న పని ప్రదేశంలో చలువ నీడ, తాగునీటి ఏర్పాట్లు ఉన్నాయా అని ప్రశ్నించి తనిఖీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డిఆర్డిఓకు సూచించారు. కూలీలతో మాట్లాడుతూ ఎన్ని గంటల వరకు పనిచేస్తున్నారని ప్రశ్నించగా, 12 గంటల వరకు పనిచేస్తున్నామని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్, విద్యుత్ శాఖ సూపర్డెంట్ ఇంజనీర్ రాజశేఖర్, డిఈ శ్రీనివాసులు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర వ్యవసాయ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్తు : యంఈఓ

వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ ఉషారాణి

భూత్పూర్,మార్చి 18,ప్రభాతవార్త : విద్యార్థులు కష్టపడి చదివే మంచిమార్కులు సాధించి ఇటు పాఠశాలకు,అటు వారి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని,కష్టపడితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారిణి ఉషారాణి స్పష్టం చేశారు.మంగళవారం భూత్పూర్ మండలం అన్నాసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ ఉషారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారికి హాల్‌టికెట్లను పంపిణీ చేశారు, అనంతరం ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో టెన్త్ సర్టిఫికేట్ ఓ మైలు రాయిగా మిగులుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు,తెలుగు పండిట్ గుముడాల చక్రవర్తిగౌడ్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు జ్యోతి,అన్నెలియోనా,విజయలక్ష్మి,ఉషారాణి,శారద,తహసిన్ బేగం,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందించే సబ్సిడీ స్పింక్లర్ పైపుల కొరకు దరఖాస్తులు చేసుకోవాలి

వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్

శ్రీరంగాపూర్,మార్చి 18 ప్రభాతవార్త: శ్రీరంగాపూర్ మండల పరిధిలోని గ్రామాల రైతాంగం అందరు కూడా తమకు తుంపర సేద్యం అవసరం ఉన్నటువంటి వాళ్లు డిహెచ్ఎస్సిఓ వనపర్తి పేరుమీద డీడీలు కట్టాలని తెలిపారు. వీరికి 25 పైపులు 5 నల్లాలు వస్తాయి. కట్టిన డీడీలు సంబంధిత ఆర్టికల్చర్ ఆఫీసులో సమర్పించి మీకు ఏ కంపెనీకి సంబంధించినవి కావాలో అధికారులకు తెలపాలని ఒకవేళ ఇప్పటికే మీ సేవలో రిజిస్ట్రేషన్ చేసినటువంటి వాళ్ళు కూడా డీడీలు కట్టి ఇవ్వకపోతే వెంటనే కట్టి ఇవ్వవలసిందిగా ఒకవేళ డీడీలు కట్టిన రానటువంటి వాళ్ళు ఎవరైనా ఉంటే రూమ్ నెంబర్ 102 వనపర్తి కలెక్టర్ ఆఫీసులో సంప్రదించాలని కోరారు. డిడి కట్టిన వారు ఉంటే కనుక ఆధార్ కార్డును వెంబడి తీసుకుని వెళ్లాలని అదేవిధంగా గతంలో డిడి కట్టిన వారు ఉన్న ఆధార్ కార్డు తీసుకుని ఎంక్వయిరీ చేసుకున్నచో స్పింక్లర్ పైపులు మీకు అందుతాయని ఈ అవకాశాన్ని అందరు కూడా నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ ప్రసాద్ యాదవ్ తెలియజేయడం జరిగింది.

సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

కోయిల్ కొండ, మార్చి 18 ప్రభాతవార్త : మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెరికివీడు సత్యపాల్ రెడ్డి, గార్లపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ దస్తగిరిలతో కలసి సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి ఆశీస్సులతో కోయిలకొండ మండలాన్ని అభివృద్ధి పథంలో జిల్లాలోనే ముందు వరసలో నిలబెడతామన్నారు. గార్లపాడు గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామంలో మట్టి రోడ్లు లేకుండా అన్ని వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలి గోపాల్, కొండ మల్లేష్, మాజీ సర్పంచ్ శ్రీహరి గౌడ్, శ్రీపాదరావు, జనార్దన్ గౌడ్, రామస్వామి, హనుమంతు యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

అండర్ డ్రైనేజీ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు, మార్చి 18 ప్రభాతవార్త : పెబ్బేరు మండలంలో తోమాలపల్లి గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఎస్సీ పాపులేషన్ జనాభాను బట్టి ఎస్సీ సబ్ ప్లాన్ అండర్ డ్రైనేజీ పనులను శాంక్షన్ చేయించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, 35 లక్షల సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ బిల్డింగ్ అదనంగా 2 లక్షలు, అంగన్వాడి స్కూలు మెయింటెనెన్స్‌కు 2లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్ కింద అదనంగా 10 లక్షల పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, పంచాయతి సెక్రటరీ వీరేష్, మాజి వార్డ్ నెంబర్ కావాలి రాములు నాయుడు, మహేష్ బాబు, గుడిసె రమేష్ కుమార్ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి శివకుమార్, మిద్దె గోవిందు, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా రాజీవ్ యువ వికాసం

నవాబుపేట,మార్చి 18 ప్రభాతవార్త : నిరుద్యోగులకు అండగా రాజీవ్ యువ వికాసం పేరుతో 6000 కోట్లతో తెలంగాణ రాష్ట్రంలోని ఐదు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వనికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి, నవాబ్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామచంద్రయ్య యువజన కాంగ్రెస్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత పది సంవత్సరాలుగా తీవ్ర అన్యాయానికి గురి అయిన నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తూనే మరొకవైపు ఉపాధి అవకాశాల్ని పెంపొందించడం కోసం సబ్సిడీతో లోన్ అందించడం హర్షించదగ్గ విషయం అని దీనికి సహకరించిన క్యాబినెట్ మంత్రులకు ఎమ్మెల్యేలకు ఇన్చార్జిలకు బీసీ కమిషన్ చైర్మన్, ఎస్సీ కమిషన్ చైర్మన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని తెలిపారు.

తెలంగాణ జాగృతి కృషి ఫలితమే అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం:దారమోని గణేష్

కల్వకుర్తి,మార్చి 18 ప్రభాతవార్త:తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామని కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకటించి, దానిని నీరుగార్చే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పైన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అలుపెరుగని పోరాటం చేసిందని జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్ పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి ఆర్అండ్‌బీ భవనంలో విలేకరులతో మాట్లాడుతూ కవిత సారథ్యంలో ప్రతి జిల్లాలోనూ వివిధ కుల సంఘాల ప్రతినిధులను కలుపుకొని చేసిన ఉద్యమ ఫలితమే నిన్నటి తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీలో బీసీ బిల్లుకు ఆమోదమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లులో కూడా తెలంగాణ కవిత కృషి 100 శాతం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు అల్లుడు కృష్ణ, శ్రీశైలం,సాదిక్, రమేష్,పాషా, పురుషోత్తం,బాబా, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

మక్తల్, మార్చి 18 ప్రభాతవార్త: వాకిటి శ్రీహరి సేవా సమితి, కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మక్తల్ మండలంలోని గుడిగండ్లలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా గుడిగండ్లతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు దాదాపు 85 మంది శిబిరానికి హాజరు కాగా, వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35 మంది కంటిచూపు లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారిని శస్త్ర చికిత్సల నిమిత్తం మహబూబ్‌నగర్ కు తరలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ కట్ట సురేష్, కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి, సత్యం గౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రమేష్, భరత సింహా రెడ్డి, సిపి తిరుపతయ్య, నర్సిరెడ్డి, డీలర్ శేఖర్, రాజు, వెంకటేశ్వర్ రెడ్డి, ఖాజా హుస్సేన్, జాకీర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష

రిలే దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

బాలానగర్,మార్చి18 ప్రభాతవార్త: బాలానగర్ మండల కేంద్రంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన రిలేనిరాహారదీక్షను చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాలమేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరాహారదీక్షలు చేపట్టామన్నారు. ఎస్సీ లలో ఏబిసిడి వర్గీకరణద్వారా తెలంగాణ ప్రభుత్వం గ్రూ ప్1, గ్రూప్2, గ్రూప్3 ఫలితాలు నిలుపుదల చేసి ఎస్సీ వర్గీకరణ ద్వారానే నియామకాలు చేపట్టాలన్నారు.ఈకార్యక్రమంలో మండలఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పసుపుల శేఖర్ ఉపాధ్యక్షులు జగన్, విష్ణు, శ్రీకాంత్, యాదయ్య, ప్రేమ్ కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ ఆలయ అభివృద్ధిపై సమీక్షా

చిన్నారెడ్డి, అజయ్ కల్లం భేటీ

ఆలయ అభివృద్ధి పై సమావేశమైన చిన్నారెడ్డి, అజయ్ కల్లం

గద్వాల, మార్చి 18 ప్రభాతవార్త : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రఖ్యాత జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లం సమీక్ష నిర్వహించారు. మంగళవారం ప్రజా భవన్ లో జరిగిన ఈ భేటీలో జోగులాంబ ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికపై చిన్నారెడ్డి, అజయ్ కల్లం చర్చించారు. కొన్నేళ్ల క్రితం మహబూబ్‌నగర్ కలెక్టర్ గా విధులు నిర్వహించిన సందర్భంగా అజయ్ కల్లం జోగులాంబ ఆలయాన్ని వెలుగులోకి తీసుకుని వచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. జోగులాంబ ఆలయ అభివృద్ధిలో ఉన్న అనుభవాన్ని అజయ్ కల్లం పంచుకున్నారు. జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం దేవాధాయ, ధర్మాధాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ సహా ఆలయ కమిటీతో ఇప్పటికే రెండు సార్లు సమీక్షా సమావేశాన్ని నిర్వహించినట్లు చిన్నారెడ్డి తెలిపారు. వచ్చే 20 వ తేదీన మరోమారు సమావేశాన్ని నిర్వహించి జోగులాంబ ఆలయ అభివృద్ధి పనులపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి వివరించారు. సత్వరమే చేపట్టాల్సిన పనుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని చిన్నారెడ్డి పేర్కొన్నారు. తక్షణ పనులలో భాగంగా ఆలయ ప్రాంగణంలో లైటింగ్, పార్కింగ్, ఆలయ చరిత్రతో ప్రచార బోర్డులు పెట్టాలని, అందుకు బస్‌స్టాండ్స్, రైల్వే స్టేషన్స్, ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని కమిటీకి ఆదేశించినట్లు చిన్నారెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాల నిర్మాణాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చిల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ భేటీలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవ రెడ్డి, రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీడ్స్ గ్రోవర్స్ సంఘం అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస కూలీ చెల్లించాలి

కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజు

ఆత్మకూరు, మార్చి 18 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాలు చెల్లించడంలో విఫలమవుతున్న నేపథ్యంలో కనీసం రోజువారి కూలీ 300 కూడా చెల్లించడం లేదని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరు మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వ్యవసాయ పొలాల దగ్గర పనులు నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలను సమావేశపరిచి ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం చెల్లించడం లేదని అలా కాకుండా రోజుకు 800 రూపాయలు కూలీ అయిన చెల్లించాలని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఉపాధి హామీ కూలీలకు 12,000 చెల్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల 60 వేల కోట్లు అవసరమవుతాయని నిపుణులు చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం కేవలం 86 వేల కోట్ల నిధులు విడుదల చేసి చదివి దులుపుకోవడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ కూలీలకు పనుల వద్ద మెడికల్ కిట్లు తాగునీటి సౌకర్యం కల్పించి కనీస కూలీ చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని లేని పక్షంలో దశలవారి ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన రాజీవ్ యువ వికాస పథకం : రాపోతు అనిల్ గౌడ్

కల్వకుర్తి,మార్చి 18 ప్రభాతవార్త:ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీయువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించిందని యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్ గౌడ్ తెలిపారు. సోమవారం తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని అనిల్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని స్వయం ఉపాధి పొందేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 5 లక్షల మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు సుమారు 6000 కోట్ల రాయితీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేయనుందని పేర్కొన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి 4 లక్షల వరకు రుణం మంజూరు చేస్తుందని తెలిపారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితీ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఏడాదిలోనే 55,000 ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి అభివృద్ధితో పాటు అన్ని సంక్షేమ పథకాలు రెండు కళ్ళల్లాగా అమలు చేస్తూ , అన్ని ప్రాంతాలను అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. రాజీవ్ వికాస పథకంతో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండటం ఖాయమని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు పలకడం చారిత్రాత్మకం

బీసీ వర్గాలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మఖ్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి

ధన్యవాదాలు తెలిపిన మఖ్తల్ కాంగ్రెస్ నేతలు

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్ టౌన్, మార్చి 18ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలు ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్న బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రఅసెంబ్లీ ఆమోదముద్ర పలకడం, అదే సమయంలో తాను శాసనసభలో ఎమ్మెల్యేగా ఉండి బీసీ రిజర్వేషన్‌కు మద్దతు తెలిపే అవకాశం కలగడం అదృష్టమని, ఇలాంటి అవకాశాన్ని తనకు కలిగించిన మక్తల్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా తాను రుణపడిఉంటానని ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి, అన్ని పార్టీలతో మంతనాలు జరిపి రిజర్వేషన్ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు తెలిపేలా చొరవ చూపిన మంత్రులు, ఇతర నాయకులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. విద్యా, ఉద్యోగరంగం తో పాటు రాజకీయంగా, ఇతర అన్ని అంశాల్లో బీసీ రిజర్వేషన్ అందుబాటులోకి వస్తే ఎంతో ఉన్నతి చెందుతారని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వంతో బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదముద్ర వేయించి ఫలాలను అందించేలా కృషిచేయాలని అన్ని పార్టీల నేతలను కోరారు.ఇటు మక్తల్‌లో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, మండల అధ్యక్షుడు గణేష్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ ఏ. రవికుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి, బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోద ముద్ర వేయడం చారిత్రాత్మకమని కొనియాడారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రిజర్వేషన్ బీసీలకు ఎంత అవసరమో వాటి ప్రాముఖ్యతను వివరించారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ కోసం ఎమ్మెల్యే గళమెత్తి అందరికీ ఆదర్శంగా నిలిచారని, అవసరమైతే రిజర్వేషన్ బిల్లు కోసం కేంద్రంతో ఎంతటి పోరాటానికైనా తాను సిద్ధమని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చెయ్యడానికైనా సిద్ధమని ప్రకటించడం ఆయన చిత్తశుద్ధికి నిరసనమని తెలిపారు. బీసీరిజర్వేషన్ బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాసులు, మండల నరేందర్,శంషుద్దీన్, చిన్న నర్సిములు,కావలితాయప్ప,గుంతలి శివకుమార్,కావలి ఆంజనేయులు,వాకిటి శ్యామ్, వాకిటి హనుమంతు, పంచలింగాల నగేష్, కల్లూరిగోవర్ధన్,గుంతలరవి,వాకిటి భాస్కర్, బ్యాగరి సురేష్, శేఖర్ ,నరసింహ, చెన్నయ్య,శివ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నేతల అరెస్ట్

ఆత్మకూర్ పోలీసులు అరెస్టు చేసిన విద్యార్థి విభాగం నాయకులు

ఆత్మకూరు,మార్చి18 ప్రభాతవార్త:మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నీ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం మొత్తం నియోజకవర్గం అధ్యక్షుడు రియాజ్ అలీ, పట్టణ నాయకులు శాలం పాషా తదితరులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ని అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ మంగళవారం రోజు బిఆర్ఎస్ వి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా విద్యార్థి నాయకులను ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచి కతపై పోలీసులు విద్యార్థి నాయకులను విడుదల చేశారు.

నూతన కమిటీకి సన్మాన కార్యక్రమం



కమిటీని సన్మానిస్తున్న సాగర సంఘం నాయకులు

పెబ్బేరు, మార్చి 18 ప్రభాతవార్త : మండల సగర కమిటీ ఎలక్షన్‌లో మండల అధ్యక్షుడుగా గెలుపొందిన గుంటి శ్రీనివాసులు సగర పెబ్బేరుని,ప్రధానకార్యదర్శి గుంటిఎల్లాస్వామి బున్యాధిపురంని జిల్లాకన్వీనర్ మోడలతిరుపతయ్య సాగర,రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకసత్యం సాగర,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్రికుంట శ్రీను,జిల్లాఉపాధ్యక్షుడు మోడల వెంకటేష్ సగర, వనపర్తి సాగర సంఘం కమిటీ మాజీ అధ్యక్షుడు ఎస్ మురళి సగర, చీర్ల పెద్ద నాగులు, గెలుపొందిన వారికి అభినందనలు తెలియజేసి, వారిని సన్మానించడం జరిగింది.ఈకార్యక్రమానికి గ్రామాల సాగర సంగల అధ్యక్షుడు, సగర బంధువులు తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనాలు.. ఇద్దరికి గాయాలు

గాయపడిన వాహనదారుడికి చికిత్స అందిస్తున్న దృశ్యం

పెబ్బేరు, మార్చి 18 ప్రభాతవార్త : హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళుతూ మార్గం మధ్యలో పల్సర్ బైక్ రిపేర్ కావడంతో స్కూటీకి తాడు కట్టుకొని వెళ్లే క్రమంలో రెండు బైకులు పెబ్బేరు బైపాస్ దగ్గర దాటే సమయంలో బండి కంట్రోల్ కాకపోవడంతో బస్సును ఢీకొన్నారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు గణేష్ 35 సంవత్సరాలు, నాగరాజు 30 సంవత్సరాలు ఆదోని స్వగ్రామంగా తెలియజేశారు. వీరిని ప్రస్తుతం వనపర్తి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని ఎంక్వయిరీ చేస్తున్నామని పెబ్బేర్ ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త:నాగర్‌కర్నూల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పెట్రోల్ పంపులో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంకు వచ్చే కస్టమర్లతో పాటు ఆ దారి గుండా వెళ్లే వారికి స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచన మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. మట్టి కుండలలో స్వచ్ఛమైన మినరల్ నీటిని అందుబాటులో ఉంచడం జరిగిందని ఆయన తెలిపారు. పెట్రోల్ బంకుకు వచ్చే వినియోగదారులు, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలి : కలెక్టర్ ఆదర్శ్ సురభి

జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్

మెగా వైద్యశిబిరంలో మాట్లాడుతున్న టియు డబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

వనపర్తి టౌన్, మార్చి 18 ప్రభాతవార్త: సమాజంలోని సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టులదే కీలకపాత్ర అని,అటువంటి జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని జిల్లాకలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.మంగళవారం టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో చిట్యాల గ్రామ శివారులోని దేశినేని శ్యామలమ్మ ఫంక్షన్ హాల్లో మెడికోవర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ వారి సహకారంతో జిల్లాలోని జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటుచేశారు.టీయూడబ్ల్యూజే(ఐజెయూ) రాష్ట్రకార్యదర్శి మధుగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ఎన్నో సమస్యల్ని వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారం దిశగా చొరవ చూపుతారని చెప్పారు. పెద్ద పెద్ద కుంభకోణాలను బయట పెట్టడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. జర్నలిస్టులు సమయాభావం లేకుండా పని చేస్తుంటారు. వారి సొంత ఆరోగ్యం పైన సైతం శ్రద్ధ వహించాలని సూచించారు. శారీరకంగా ఫిట్

అంగన్‌వాడీల వంటావార్పు కార్యక్రమం

వెట్టి చాకిరి చేస్తున్న కనీస వేతనం అమలు చేయరా? : మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నారాయణపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త : అంగన్వాడీలు వెట్టిచాకిరి చేస్తున్న కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్‌లు విమర్శించారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రం లో మున్సిపల్ పార్క్ దగ్గర రెండో రోజు కొనసాగిన అంగన్వాడీల వంట వార్పు కార్యక్రమానికి ఆయన హాజరై మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. పసిపిల్లలకు గర్భిణి బాలింతలకు ఎన్నో సేవలందిస్తున్న అంగన్వాడీలకు కనీస అవసరాలు తీర్చే విధంగా ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు. పీఎం శ్రీ,నూతన విద్యావిధానం మోడల్ కేంద్రాలంటూ ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని దీనిని అంగన్వాడీలు ఐక్యంగా ఎదురుకోవాల నిపిలుపునిచ్చారు.నూతన విద్యా విధానంతో పేదలకు విద్య దూరమవుతుందని కార్పొరేట్ శక్తులకు వ్యాపారంగా మారుతుందని విద్యలో కాసాయికరణ పెరిగి మతోన్మాద విధానా నెలవుగా మారు తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకట్రారెడ్డి ,జిల్లా కార్యదర్శి బాల్ రాన్, అంగన్వాడి యూనియన్‌నాయకులు పుష్ప రాధమ్మ నారాయణమ్మ ప్రసంగించారు. బడ్జెట్ సమావేశాలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు 18 వేలు కనీస వేతనం నిర్ణయించి అమలుచేయాలన్నారు.అనంతరం ధర్నా శిభిరం దగ్గరకు వచ్చిన తహశీల్దార్ అమరేందర్ కృష్ణకు వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో కళావతి, చంద్రకళ, రమాదేవి,సత్యమ్మ,బుగ్గమ్మ, విజయలక్ష్మితోపాటు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన రవికుమార్‌కు సన్మానం

శ్రీరంగాపూర్, మార్చి 18 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండల్ కంబాలపురం గ్రామానికి చెందిన మేకల బాలయ్య, బాలమ్మ దంపతుల రెండో కుమారుడైన రవికుమార్ తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(టిజిపిఎస్సి) ఉద్యోగం సాధించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్,మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి సన్మానం చేయడం జరిగింది. రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగమును సాధిం చి యువతకు ఆదర్శంగా నిలిచిన రవికుమార్‌ను మెచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా తను ఇంకా ముందు ముందు ఎన్నో విజయాలను సాధించాలని అదేవిధంగా తన వృత్తిరీత్యా అనేక మందికి ఆదర్శంగా నిలుస్తూ మంచి భావి భారత పౌరులను తయారు చేయాలని చెప్పడం జరిగింది. రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగం సాధించడం చాలా సంతోషంగా ఉందని తనను సన్మానించినందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి, పురుషోత్తం యాదవ్, గ్రామ అధ్యక్షుడు స్వామి,తిరుపతయ్య, హరీష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

మాగనూరు, మార్చి 18 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాగనూరులో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పలుసూచనలు ఇస్తూ పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో జిల్లాలోని మొదటి స్థానం తీసుకురావాలని అన్నారు.కార్యక్రమంలో ఎంఈఓ మురళీధర్‌రెడ్డి డిఇఓ గోవింద రాజులును ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో విద్యార్థులసంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. జిల్లా మధ్యాహ్న భోజన ఇన్చార్జ్ యాదయ్య శెటి, ఎంఈఓ మురళీధర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల ఇంద్రమ్మ, మాజీ సర్పంచ్ ఆనంద్, శీను, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, గ్రామ పెద్దలు యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మద్దూర్, మార్చి 18 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ బాలుర హైస్కూల్లో పాఠశాల వార్షికోత్సవ వేడుకలను విద్యార్థి విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నృత్యాలు, డాన్సులు,మిమిక్రీలు, ఆనందోత్సాహాల మధ్య విద్యార్థులు జరుపుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సవిత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీఆంజనేయ భజన మండలి సభ్యుల భక్తి కీర్తనలు

చిన్న చింతకుంట, మార్చి 18 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం పిలుపుమేరకు చిన్నచింతకుంట మండల కేంద్రానికి చెందిన శ్రీ ఆంజనేయ స్వామి భజన మండలి సభ్యులు శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలోని అఖండ హరినామ సంకీర్తన మండపంలో స్వామివారి భక్తి కీర్తనలను ఆలపించారు. శ్రీ తిరుమల వెంకటేశ్వర సన్నిధిలో సోమవారం స్వామివారి భక్తి కీర్తనలను ఆలపించే భాగ్యం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని భజన మండలి సభ్యులు తెలిపారు .శ్రీ స్వామివారి సంకీర్తనలలో పాల్గొన్న భజన మండలి అధ్యక్షులు కిషన్ జి, సభ్యులు బాలాజీ, నారాయణ బాయ్, శివాజీ, దేవన్న, వెంకటేష్ ,గణేష్ ,అనంత రావు, గోవర్ధన్ ,నరేందర్, దశరథ్, శివరంజని, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో ప్రతి మొక్కను సంరక్షించుకోవాలి : ఎంపీడీఓ

ఉప్పునుంతల, మార్చి 18 ప్రభాతవార్త: ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్న నర్సరీలను మొక్కలు దెబ్బతినకుండా సంరక్షించుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్ లాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెల్టూరు, గువ్వలోని పల్లి, సూర్య తండా, తాడురు, ఈరట్వాన్ పల్లి గ్రామాలలో ఉన్న నర్సరీలను పరిశీలించారు. జాతీయ రహదారి వెంట ఉన్న మొక్కలను పరిశీలించి వాటికి నీళ్లు పట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న పనులను కూలీలచే ఉపాధి పనులు చేపట్టాలని, నర్సరీలు దెబ్బతినకుండా చూడాలని కోరారు. వేసవి కాలం కావడంతో నర్సరీలో ఉన్న మొక్కలకు ఎప్పటి కప్పుడు నీళ్లు పట్టాలని సూచించారు. ఎంపిడిఓ మోహన్ లాల్‌తో పాటు టెక్నికల్ అసిస్టెంట్ సింగోటం, పంచాయతీ కార్యదర్శులు ఉమాశంకర్, వెంకటేష్,ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్‌పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలను సందర్శించిన విద్యార్థులు

చిన్న చింతకుంట, మార్చి 18 ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు భాగస్వామ్య పాఠశాలైన ఉన్నత పాఠశాలను సందర్శించారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశం మేరకు ట్వినింగ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా ఫర్దిపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు పాఠశాల హెచ్ఎం నేపాల్ ఆధ్వర్యంలో లాల్‌కోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హైస్కూల్ ఉపాధ్యాయులు స్వాగతం పలుకుతూ పాఠశాలలోని విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, సైన్స్ ల్యాబ్, గణిత ల్యాబ్, భోజన గది, న్యూట్రి గార్డెన్, నిఘా కెమెరాలు సౌకర్యాలు బాగున్నాయని ఇలాంటి పాఠశాలలో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పాఠశాల జిహెచ్ఎం ఎంఈఓ మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలో మూలాధారమని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకుగాను రాష్ట్ర విద్యాశాఖ పిలుపు మేరకు భాగస్వామ్య పాఠశాలల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, మేదోమధనం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విద్యార్థులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు.ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నత పాఠశాలలోని సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పి విజయ్ సింహ ఉన్నారు.

టెంకాయ టెండర్లను అడ్డుకున్న గ్రామస్తులు

కృష్ణ, మార్చి 18 ప్రభాతవార్త : మండలం గుడెబల్లూర్ గ్రామంలో శ్రీ స్వయంభు లక్ష్మి వేంకటేశ్వర జాతర సందర్భంగా మంగళవారం దేవాదాయశాఖ ఈవో శ్యాంసుందర్ టెంకాయల టెండర్ నిర్వహిస్తుండగా ఆలయ అభివృద్ధిలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ టెంకాయల టెండర్‌ను గ్రామస్తులు అడ్డుకున్నారు. దేవాలయ పనులు మరమ్మతులు, పనులు చేయకపోవడంపై మండి పడ్డారు. దేవాలయానికి వస్తున్న ఆదాయం గురించి సరిగ్గా లెక్క పత్రాలు చూపించకపోవడం, నిధులు ఉన్నా ఆలయాన్ని అభివృద్ధి చేయక పోవడాన్ని నిలదీశారు. ఆలయ ఆదాయం, అభివృద్ధి పనులపై స్పష్టం చేసేవరకు టెంకాయ టెండరు బహిరంగ వేలం వేయవద్దని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టెంకాయల వేలాన్ని వాయిదా వేశారు. చెట్టే కర్నప్ప, వాకిటి రామకృష్ణ, జి.హన్మిరెడ్డి, అలకట్ సురేష్, బి మహాదేవ్, డి.చక్రవర్తి, జి తరుణ్, సి.శివరాజ్, ఎస్ ప్రకాష్, పి.నరసింహ స్వామి, రాధాకృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలి : ఎస్సై రేవతి

నారాయణపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై రేవతి అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నారాయణపేట పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మహిళా ఎస్సై రేవతి,ఏఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని లేని యెడల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. మద్యం సేవించివాహనాలు నడపరాదని సూచించారు.వాహనాలకు నెంబర్ ప్లేటు తప్పనిసరిగా వేయించుకోవాలని, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదని లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్సై ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, స్పెషల్ పార్టీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలి

ప్రతి విద్యార్థి కొలతలు తీసుకొని యూనిఫారం చక్కగా కుట్టే విధంగా చూడాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మార్చి 18 ప్రభాతవార్త: వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించే విధంగా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజిబివి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఉచిత ఏకరూప దుస్తుల విషయంలో మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్‌లో విద్యా శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజిబివిల్లో చదువుకుంటున్న రూ.40 వేల పైచిలుకు విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి కనీసం ఒక జత ఏకరూప దుస్తులు అందించే విధంగా వెంటనే చర్యలు ప్రారంభించాలని సూచించారు. యూనిఫారంకు అవసరమైన మేరకు బట్ట తెప్పించుకోవడానికి వెంటనే ఇండెంట్ పెట్టాలని సూచించారు. అదే విధంగా చివరిసారి ఏ మహిళా సంఘాలకు అయితే యూనిఫారం కుట్టేందుకు ఇచ్చారో అవే సంఘాలకు ఆర్డర్ ఇవ్వాలని,

విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రతి విద్యార్థి కొలతలు తీసుకొని యూనిఫారం చక్కగా కుట్టే విధంగా చూడాలని గ్రామీణాభివృద్ధి శాఖ పిడి ను ఆదేశించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి కనీసం ఒక జత దుస్తులు ఇవ్వాలని మిగిలిన మరో జత పాఠశాలలు ప్రారంభం అయ్యాక ఇవ్వాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, డిఈఓ మొహమ్మద్ ఘని, గ్రామీణాభివృద్ధి శాఖపిడిఉమాదేవి, డిపియంఅరుణ పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడనాడాలి

- 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్

ఉప్పునుంతల, మార్చి 18 ప్రభాతవార్త: రానున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ధైర్యంగా ఉండి పరీక్షలకు హాజరు కావాలని పరీక్షలంటే భయాన్ని విడనాడాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం 9వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యంలో జరిగిన కల్చరల్, స్పోర్ట్స్,పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముందు విద్యార్థులు యొక్క నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలను డిఇఓతిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో డిఇఓ మాట్లాడుతూ విద్యార్థులు భాయన్ని విడి పరీక్షలు హాజరు కావాలని, ఉత్తీర్ణత శాతం పెంచాలని అందరూ ఉత్తమ ఫలితాలు సాధించికుటుంబ సభ్యులకు, పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న డిఇఓ రమేష్ కుమార్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఈ సంవత్సరం పదో తరగతిలో మంచి మార్గం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పదవ తరగతి పరీక్ష రాయబోతున్న విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడులు,పెన్నులు అందజేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖా ధికారి రమేష్ కుమార్‌ను హైస్కూల్ ఉపాధ్యాయ బృందం శాలు వాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, పోల శ్రీధర్, కల్పన, పోకల సతీష్, చంద్రశేఖర్, శ్యాంసుందర్ గౌడ్,అజ్మతుల్లా, లక్ష్మణ్, శ్రీనివాసులు,గోపి,మల్లారెడ్డి, శ్యామలగౌరి, విజయ,రాజవర్ధన్ రెడ్డి, వీరోజు రాజు, పద్మావతి, శ్రీలత, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీల గొంతుక వినిపించింది బీఆర్ఎస్

- నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్

బిజినపల్లి, మార్చి 18 ప్రభాతవార్త: విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 రిజర్వేషన్ల బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ బీసీల తరఫున సంపూర్ణ మద్దతు ఇస్తూ తమ గొంతుక వినిపించిందని నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్ అన్నారు. మంగళవారం బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విలేకరులతో మాట్లాడారు. గంగనమోని కిరణ్ మాట్లాడుతూ బీసీలకు 42 రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్న బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ సాక్షిగా తన చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. బీసీ కుల సంఘాలతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రౌండ్‌టేబుల్ సమావేశాలు పెట్టి బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 రిజర్వేషన్ కల్పించాలని వివిధ వేదికల మీద బీసీల గొంతుక వినిపించడంతో ప్రభుత్వం బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిందన్నారు. మొదటినుంచీ బీసీలకు వారిహక్కుల విషయంలో అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ పార్టీ అని ఈ బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది అని గుర్తు చేశారు. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బిల్లుకు పార్లమెంట్ ఆమోదం కూడా పొందాల్సి ఉన్నందున ప్రధాని మోదీ వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 37 శాతానికి పెంచాలని

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగనమోని కిరణ్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపించిందన్నారు. అయితే, కేంద్రం వద్ద తీర్మానం పెండింగ్‌లో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రతిపాదనలను ఉపసంహరించుకుంటున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎటువంటి భేషజాలకు పోకుండా, బీసీ హక్కుల పరిరక్షణ ఏకైక లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో సంపూర్ణ సహకారం అందించిందన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన పోరాట ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసిందని అన్నారు.

జమ్ములమ్మ దేవతకు భక్తుల మొక్కులు

చిన్న చింతకుంట, మార్చి 18 ప్రభాతవార్త: మండల కేంద్రం సమీపంలోని శ్రీ జమ్ములమ్మ దేవత ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. మండల కేంద్రంతో పాటు ఉంద్యాల, మద్దూర్, ఎదులాపూర్ గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి కొత్త కుండలో పచ్చిపులుసును పరమాన్నంతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని అమ్మవారిని కోరుకున్నట్లు భక్తులు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళా భక్తుల కష్టాలు తీరడం లేదు.మహిళా భక్తులు దుస్తులను మార్చుకునేందుకు

తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ముండ్ల పొదల చాటున దుస్తులు మార్చుకునే దుస్థితి ఏర్పడిందని మహిళా భక్తులు వాపోయారు. ఇప్పటికైనా దేవస్థానం వారు దాతల సహకారంతో మహిళా భక్తులు దుస్తులు మార్చుకునే తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోజుకు 2 వేల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

ఇటిక్యాల, మార్చి 18 ప్రభాతవార్త: ఉమ్మడి మండలంలో రోజుకు 2 వేల మందికి ఉపాధి పనులు కల్పించాలని ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉదయం పూట త్వరగా పనులు ప్రారంభించాలని కూలీలకు నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు ఎంపీడీవో, ఏపీవోను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని ఇటిక్యాల సమీపంలో లింగమ్మ చెరువు కట్ట నుండి శివనంపల్లి రోడ్డు అదేవిధంగా లింగమ్మ కట్టచెరువు నుండి పెద్దదిన్నే రోడ్డు పనులు ఉపాధి కూలీలు నిర్వహిస్తుండగా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రోజుకు 2 వేల మందికి ఉపాధి పనులు కల్పించేలా చూడాలని ప్రస్తుతం 11 వందల మంది కూలీలు హాజరవుతున్నారని ఉపాధి పనులలో కూలీలు పాల్గొనేలా చూడాలని ఎంపీడీవో, ఏపీవోకు సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పనులు ఉన్నాయని ఈనెల చివరి నాటికి పనులు పూర్తవుతాయని అదనపు కలెక్టర్ కూలీలు వివరించారు. వీరి వెంటఎంపీడీవో మహమ్మద్ అజార్ ముహియుద్దీన్, ఏపీఓ శివ జ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఇటిక్యాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

బీసీల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్

టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

మాట్లాడుతున్న జహీర్ అక్తర్

మహబూబ్‌నగర్, మార్చి18 ప్రభాతవార్త: బీసీల సంక్షేమాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విస్మరించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.20,69,588 కోట్ల బడ్జెట్లో బీసీల సంక్షేమం కోసం కేవలం 2శాతం అనగా కేటాయించిన రూ.41,484 కోట్లలో ఖర్చు చేసింది రూ.25,419 కోట్లు మాత్రమేనని విమర్శించారు. రూ.100లో 2రూపాయల 22 పైసలు ఖర్చు చేశారన్నారు. మొత్తం బడ్జెట్లో పదేళ్లలో రైతుబంధు,ఇతర పథకాలకు సంబంధించి రూ.81.668కోట్లు కేటాయించి తమ పాలనలో 3.95 శాతం ఖర్చు చేశారని అన్నారు. దీనిబట్టి బీసీల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వా నికి ఎంత ప్రేమఉందో అర్థమవుతుందన్నారు. ఎంబీసీలకు సంబంధించి బీసీ కులాల కార్పొరేషన్కు రూ.3850 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది రూ.20 కోట్లు మాత్రమేనని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో బీసీలకు స్వర్ణయుగమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు42శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. కులగణన సర్వేను తప్పు అని కేటీఆర్ అనడం సరికాదన్నారు. వెంటనే ఆయన సర్వే చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు క్షమాపణలు చెప్పాలనిడిమాండ్ చేశారు. కెసిఆర్ కుటుంబం సర్వేలో పాల్గొనక పోవడం బీసీలను అవమానించినట్లేనని విమర్శించారు. బీసీల 42శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించే బాధ్యతను బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలపై ఉందన్నారు.సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్‌గౌడ్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి,అజ్మత్‌అలీ,రాములుయాదవ్ పాల్గొన్నారు.

త్వరలో శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

- కొప్పునూరు సింగిల్ విండో చైర్మన్ నరసింహారెడ్డి

చిన్నంబావి, మార్చి18 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొప్పునూరు సింగల్ విండో ఆధ్వర్యంలో త్వరలోనే తెలంగాణ మార్కుఫెడ్ ఆదేశానుసారం పప్పు శనగా కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని సింగల్ విండో చైర్మన్ బంగారి నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పప్పు సెనగ సాగు చేసి, పంటలను ఆన్లైన్లో నమోదు చేసుకున్న రైతుల పప్పుశనగ పంటను మాత్రమే కొనుగోలు చేస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.5650 కి కొనుగోలు చేస్తామని త్వరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నర్సింహా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

చిన్నచింతకుంట, మార్చి18 ప్రభాతవార్త: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నెల్ల

18 ఏళ్లు నిండిన ప్రతి ఒకరూ ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

■ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

వనపర్తి టౌన్, మార్చి 18 ప్రభాతవార్త: ఏప్రిల్1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకుంటే, రాబోయే ఎన్నికల్లో ఓటరుగా అవకాశం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఫామ్ 6, 7, 8 లపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫామ్ 6, 7, 8 లపై అవగాహన కలిగి ఉండాలని, వీటిపై ఏమైనా సందేహాలు ఉంటే నివేదిస్తే, వాటిని ఎన్నికల సంఘానికి సమర్పించడం జరుగుతుందని చెప్పారు. ఏప్రిల్ 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 ద్వారా కొత్త ఓటర్‌గా నమోదు చేయవచ్చని చెప్పారు. ఎవరైనా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసం మారినప్పుడు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకొని మార్పు జరిగిన ప్రాంతంలో ఓటు పొందవచ్చని చెప్పారు. అదేవిధంగా, మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు ఫామ్ 7 ద్వారా అప్లై చేయవచ్చని చెప్పారు. ఫామ్ 7 ఎవరైనా దరఖాస్తు చేయవచ్చని, దాని ఆధారంగా బిఎల్వోలు వెరిఫై చేసి ఓట్లను తొలగించడం జరుగుతుందన్నారు. ఫామ్ 6 ద్వారా కొత్త ఓటర్లు మాత్రమే నమోదు చేసుకోవాలని, ఇదివరకే ఓటు కలిగి ఉండి మళ్లీ ఫాం 6 ద్వారా అప్లై చేసుకోవడం సరికాదని సూచించారు. ఇప్పటికే జిల్లాలో ఎలక్ట్రోరల్ రోల్‌ను ప్రచురించడం జరిగిందని, సంబంధిత పార్టీల ప్రతినిధులు తమ పార్టీ నుంచి కాంటెస్ట్ చేయబోయే వారి పేర్లు రోల్‌లో ఉన్నాయో లేవో ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఎలక్ట్రోల్ రోల్‌లో పేరు ఉంటేనే ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, సి సెక్షన్ సూపరిండెంట్ కిషన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నుంచి రాజేంద్రప్రసాద్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి గట్టు యాదవ్, బిజెపి నుంచి కుమారస్వామి, సిపిఎం నుంచి పరమేశ్వర ఆచారి, టిడిపి నుంచి కొత్తగళ్ల శంకర్, బీఎస్పీ నుంచి రాజు తదితరులు పాల్గొన్నారు.

వయస్సుకు తగ్గ ఎత్తు,బరువు లేని ఆరు ఏళ్ల పిల్లలను ఎన్ఆర్‌సికి పంపించాలి : జిల్లా కలెక్టర్

వనపర్తి టౌన్, మార్చి 18 ప్రభాతవార్త: జిల్లాలో 06 ఏళ్ల వయసున్న పిల్లల్లో వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలను గుర్తించి ఎన్ఆర్‌సికి పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో స్యాం, మ్యాం పిల్లలు, దివ్యాంగుల స్వయం ఉపాధిపై సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో స్యామ్, మ్యామ్ పిల్లలు ఎంతమంది ఉన్నారో గుర్తించి, వారిని ఎన్ఆర్‌సి కేంద్రానికి రప్పించి అవసరమైన వైద్య సదుపాయం అందించి వయస్సుకు తగ్గ ఎత్తు బరువు లేకుండా ఉండటానికి గల కారణాలను తెలుసుకొని సరైన వైద్యంతో పాటు అక్కడే పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎన్ఆర్‌సిలోని వైద్య సిబ్బందితో పాటు ఒక అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్, ఆశా వర్కర్ ను అందుబాటులో ఉంచే విధంగా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంతమంది పిల్లలను తీసుకువచ్చారు, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది బరువు పెరిగారా అని ఆరా తీశారు. ఎన్ఆర్‌సి అనేది ఒక అడ్వాన్సు వైద్య కేంద్రమని, ఇక్కడ పిల్లలను ఆరోగ్యవంతులను చేసేందుకు ఒక నిర్దిష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నిబంధనల మేరకు పిల్లల వెంట వచ్చే తల్లికి రోజుకు నిర్దేశించిన డబ్బును చెల్లించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ పై తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాలోని అంగన్వాడీలలోమౌలిక సదుపాయాల కల్పనలో భాగంగాటాయిలెట్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, అంగన్వాడీలలో అవసరం ఉన్నచోట పెయింటింగ్స్ వేయించడం, తాగునీరు ఏర్పాట్లు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, సూపరిండెంట్, సిడిపివోలు, సూపర్వైజర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ గద్వాల జిల్లా బీజేపీ అధ్యక్షులుగా బోయ రామాంజనేయులు

గద్వాల, మార్చి 18 ప్రభాతవార్త: జోగులంబ గద్వాల జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా టి. రామాంజనేయులు ఎన్ని కయ్యారు. జిల్లా అధ్యక్ష పదవికి ఏకంగా 3 మంది నామినేషన్లు వేసినా, పార్టీ అధిష్టానం అన్నివిధాలా ఆలోచించి బీసీ వర్గానికి చెందిన టి. రామాంజనేయులును జిల్లా అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టింది. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గా కొనసాగుతున్న టీ. రామాంజనేయులు గత పార్టీ కార్యక్ర మాలతో పాటు, నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బలోపేతంగా పని చేసారు. నా పై నమ్మకంతో బిజెపి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పజెప్పిన భారతీయ జనతా పార్టీకి, పెద్దలు మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణకి ధన్యవాదాలు తెలిపారు. నా పై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, సమిష్టిగా పనిచేసి జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతం చేస్తామని అన్నారు.

బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా బండల వెంకట్ రాములు నియామకం

గద్వాల, మార్చి 18 ప్రభాతవార్త : బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గా గద్వాల కు చెందిన బండల వెంకట్రాములు మంగళవారం ఎన్నికయ్యార్ము. నా పై నమ్మకంతో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గా బాధ్యతలు అప్పజెప్పిన భారతీయ జనతా పార్టీకిపెద్దలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణకి ధన్యవాదాలు తెలిపారు. నా నమ్మకాన్ని నిలబెడతానని సమిష్టిగా పనిచేసి బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

టీజీఎండిసి చైర్మన్‌ను కలిసిన ఎండి ఇస్మాయిల్

అలంపూర్,మార్చి 18 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మినరల్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్ కుమార్‌ను బిఎస్ఎన్ఎల్ తెలంగాణ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఎండి ఇస్మాయిల్ కలిశారు. మంగళవారం ఆయన జోగులాంబ గద్వాల్ రోడ్డు రవాణా శాఖ అథారిటీ మెంబర్ సతీష్ కుమార్‌రెడ్డితో కలిసి హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు.

ముంపు భూములకు పరిహారం ఇవ్వాలి

■ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు

చిన్నంబావి, మార్చి 18 ప్రభాతవార్త: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన చెరువులు, కుంటలలో జూరాల, బీమా తదితర ప్రాజెక్టుల కాలవల ద్వారా రైతుల పట్టా భూములు మునకకు గురవుతున్నాయనిఅట్టి భూములకు ఆయా ప్రాజెక్టుల చెరువులు, రిజర్వాయర్ల కింద ఉన్న మునక భూములు గల రైతులకు ప్రభుత్వ పరిహారం అందించాలని మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చిన్నంబావి మండల తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పిజెపి, బీమా కాలువలు వచ్చిన 25 సంవత్సరాల నుండి పట్టా భూములు మునిగిపోయి తొలకరి వర్షాకాలంలో, రబీ సీజన్లో రైతులు పంటలు వేసుకోవడానికి వీలు కాకుండా ఉందని, పిజెపి, భీమా కాల్వలు ద్వారా నీళ్లు వచ్చిన కాలం నుండి చెరువుల్లో, కుంటలో పట్టా భూములుమునుగుతున్నా, నేటికీ అధికార యంత్రంగాని, పాలకులుగాని నష్టపరిహారం చెల్లించలేదని, కాలువలద్వారా భూమి కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చినట్లుగానే కుంటల్లో, చెరువుల్లో పట్టా భూములు ఉన్న రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సింగోటం రిజర్వాయర్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చారనీ, గోపాల్‌దిన్నే రిజర్వాయర్లు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చారని శ్రీశైల డ్యామ్ ఎత్తు పెంచడం మూలంగా కొన్ని గ్రామాలు,వేలాదీ ఎకరాల భూములుమునిగితే నష్టపరిహారం ఇచ్చారనీ, ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం ఇచ్చారు కానీ, సొంత పట్టా భూములు ఉండి, చెరువుల్లో, కుంటల్లో భూములు మునిగితే నష్టపరిహారం ఎందుకు ఇవ్వకూడదని వారు ప్రశ్నించారు.మండల పరిధిలోని పెద్దదగడ చెరువులో దగడపల్లి, పెద్దదగడ గ్రామాలకు చెందిన భూ పట్టా రైతులకు ఎకరాకు రూ. 30 లక్షల నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలని దగడపల్లి గ్రామానికి చెందిన రైతులు చిన్నంబావి మండల తాసిల్దార్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి.వెంకటస్వామి, మద్దిలేటి, మర్లబావి శ్రీను, యస్.రాముడు మురళీధర్ రావు, కొండలయ్య తదితరులు రైతులున్నారు.

సిద్దాయపల్లిలో 29.55క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

భూత్పూర్,మార్చి 18,ప్రభాతవార్త : భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్దయపల్లి గ్రామంలో 59ప్లాస్టిక్ సంచులలో అక్రమంగా నిల్వ ఉంచిన 29.55క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు భూత్పూర్ డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మమత మంగళవారం తెలిపారు.భూత్పూర్ పోలీసుల సమాచారం మేరకు తాము భూత్పూర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేష్‌లు కలిసి దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని జడ్చర్ల స్టాక్ పాయింట్‌కు తరలించి అక్రమంగా నిల్వ ఉంచిన మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలోని పాల్కొండ గ్రామానికి చెందిన క్రిష్ణయ్యపై కేసు నమోదు చేసి చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని పీఎస్‌లో ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేసినట్లు ఆర్ఐ వెంకటేష్,డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ గీత తెలిపారు.

పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

చిన్నంబావి, మార్చి 18 ప్రభాతవార్త : మండల పరిధిలోని పెద్దమారు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు జి.రమణమ్మ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్ద మారూర్ గ్రామ నివాసి సీఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానిస్తామని చెప్పారు. అలాగే 2009 నుంచి 2025 వరకు పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకునగదు ప్రోత్సాహం అందిస్తున్నారు.వచ్చే ఫలితాల తర్వాత కూడా అందజేయడం జరుగుతుందనిఅన్నారు.ఈ కార్యక్రమంలోస్కూల్ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సరఫరాలో

అంతరాయం లేకుండా చర్యలు

■ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ■ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

వరిక్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త: వేసవిలో తాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దేవరకద్రలో పర్యటించారు. దేవరకద్ర తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, ఎంపిడిఓ, ఎంపిఓ, ఎంఈఓ, ఏపిఓ, వ్యవసాయ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యుత్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మండలంలో త్రాగు నీటి సరఫరా,విద్యుత్ సరఫరా పరిస్థితి పై సమీక్షించారు. గ్రామాల్లో వేసవి ముగిసే వరకు నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓవర్ లోడ్ తో సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో సమస్య ఉంటే వెంటనే పునరుద్ధరించాలని అన్నారు. అదే విధంగా మండలం లో పంటల పరిస్థితి పై, వేసవిలో భూగర్భ జలాలు ఇంకి పోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందా అని అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ, ఇరిగేషన్, విద్యుత్ అధికారులు గ్రామాల్లో పర్యటించాలని, రైతులతో మాట్లాడి సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు. బోరు బావుల కింద భూగర్భ జలాలు ఇంకి పోయి పంటలుఎండిపోయే పరిస్థితి ఉంటే నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకొనేలా రైతులకు అవగాహన కలిగించాలని అన్నారు. వచ్చే సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరు తడి పంటలు వేసుకునేలా రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కలిగించాలని అన్నారు. డోకూర్ గ్రామంలో వరి క్షేత్రం పరిశీలించిన కలెక్టర్ అనంతరం డోకూర్ గ్రామంలో పర్యటించారు. రైతు చంద్రశేఖర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వరిపైరును పరిశీలించారు. రైతు12 ఎకరాలలో వరి పైరు వేశారు.వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సూచనలు,సలహాలు అందించాలని అన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ శ్రీనివాస రావు,వ్యవసాయ అధికారి అగర్వాల్, మిషన్ భగీరథ ఏఈ కీర్తి రెడ్డి, ఇరిగేషన్ ఏఈలు హరిందర్, కిషన్ ఇతర అధికారులు ఉన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రతి ఒక్క విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి పది పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గద్వాల, మార్చి 18 ప్రభాతవార్త: ప్రతి విద్యార్థి కష్టం తో కాకుండా ఇష్టంతో చదువాలని ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే కి స్కూల్ కరస్పాండెంట్ ఉపాధ్యాయ బృందం శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి పాఠశాలలో చదువుకొని ఈ పాఠశాల లో మంచి విషయాలను చదువుతో పాటు నేర్చుకోవడం జరిగిందన్నారు. కానీ నేడు పాఠశాలను విడిచి వెళ్లాల్సిన సమయం వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన, మనం చదువుకున్న పాఠశాలను గురువులను ఎప్పటికీ మర్చిపోరాదన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి కొరకు తమ వంతుగా కృషి చేయాలని కోరారు. త్వరలోనే జరగబోయే 10వ తరగతి పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకొని పరీక్షలను పరీక్షల సమయంలో విద్యార్థులు మంచి ఆలోచన నుంచి ఈ పది రోజులు సమయంలో వ్యసనాలకు టీవీలకు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి. ఒక టైం టేబుల్ నిర్ణయించుకొని ఏకాగ్రతతో చదువుకోవాలి అని తెలిపారు. ఒక విద్యార్థి పరీక్షా సమయంలో ఎవరు కూడా ఆందోళన పడకుండా ఏకాగ్రతతో పరీక్ష లను రాసి మంచి ఉత్తీర్ణతను సాధించి మీ బంగారు భవిష్యత్తును తీర్చిదిదుకుని విధంగా వైపుగా అడుగులు వేయాలని మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలకు ఉపాధ్యాయులకు, గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని రాష్ట్రం లోనే పదో తరగతి పరీక్షలలో గద్వాల మొదటి ర్యాంకును సాధించే విధంగా ప్రతి ఒక్క విద్యార్థి కృషి చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ నాగిరెడ్డి,నరహరి శ్రీనివాసులు, పూడూరు కృష్ణ, స్వచ్ఛంద సంస్థ అధినేత రత్నం సింహా రెడ్డి, నాయకులు గువ్వల గోపాల్, పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, ఉపాధ్యాయబృందం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ క్రింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలి

◆ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నారాయణపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త: నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద భూములు కోల్పోతున్న రైతులకు 2013 చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని ఎఐకెఎస్ జాతీయ నాయకులు మాజీఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. భూసంరక్షణ కమిటి ఆధ్వర్యంలో ఎస్ఆర్ గార్డెన్‌లో జి. వెంకట్రామారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాజెక్ట్ క్రింద భూములు కోల్పోతున్న రైతులకు నోటిస్‌లు ఇవ్వకుండానే దౌర్జన్యంగా పోలిస్‌లను పెట్టి భూసేకరణ చేయడం సరైంది కాదన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గం, సొంత జిల్లా వాసిఅయినందున రైతులు మాకు న్యాయం జరుగుతుందని ఆశగా ఉన్నారు.ప్రభుత్వం రైతుల కడుపుకొడ్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రైతు ఒకసారి భూమి కోల్పోతే వారి కుటుంబం దేనిపై ఆధారపడి బతకాలో అర్థం కాక దిక్కుతోచని పరిస్థితుల్లోకి నెట్టబడుతుంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే రైతులతో చర్చించి భుమికి బదులు భూమి ఇవ్వాలి లేదా న్యాయమైన పరిహారం 2013చట్ట ప్రకారం బహిరంగ మార్కెట్ రేట్‌కు మూడింతలు కలిపి ఇవ్వాలని డిమాండ్ చేసారు. మీకు న్యాయం జరిగే వరకు మీ వెంట మేముంటామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహేష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య, మచ్చందర్, రాజు, కేశవ్‌గౌడ్, నారాయణ, సాయికుమార్,నర్షిములు గౌడ్, లక్ష్మికాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి ఆశా వర్కర్ల వినతి

నారాయణపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణ వైద్యాధికారి నరసింహా రావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని నేటి కలెక్టరేట్ ధర్నాకు జిల్లాలోని వివిధ పిహెచ్‌సిల పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ఆశా వర్కర్లు ఉన్నారు.

జోరుగా టీయుడబ్లుజె సభ్యత్వాలు

భూత్పూర్,మార్చి18,ప్రభాతవార్త: ఇండియన్ జర్నలిస్టు యూనియన (ఐజెయు) అనుబంధమైన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయుడబ్లుజె) సభ్యత్వాలు జోరుగా సాగుతున్నాయి.మంగళవారం యూనియన్ జిల్లా అడహక్ కమిటీ సభ్యులు సతీష్‌రెడ్డి,ప్యాట వెంకటయ్య, జిల్లెల రఘుల ఆధ్వర్యంలో భూత్పూర్ మండల జర్నలిస్టులు టీయుడబ్లుజెలో సభ్యత్వం తీసుకున్నారు.సభ్యత్వం తీసుకున్నవారిలో గొడుగు వెంకటయ్య(వార్త),ముడావత్‌శంకర్(ఆంధ్రజ్యోతి),అర్వ విజయ్‌కుమార్ (ఆంధ్రప్రభ) బీవీ రావ్(సాక్షి), ఎండి జహంగీర్(మనం),డి క్రిష్ణమోహన (తెలుగు సత్తా),వి క్రిష్ణమాచారి(మన ఊరు) ఉన్నారు.త్వరలో భూత్పూర్ మండల టీయుడబ్లుజె నూతన కమిటీ ఏర్పాటు చేయాలని జిల్లా అడహక్ కమిటీ సతీష్‌రెడ్డి భూత్పూర్ జర్నలిస్టులను కోరారు.

పోలీస్ అధికారులతో ఎస్పీ డి. జానకి సమీక్ష

పోలీస్ సిబ్బందితో జిల్లా ఎస్పీ డి. జానకి

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 18 ప్రభాతవార్త : మహబూబ్ నగర్ టౌన్‌లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.జానకి పర్యవేక్షించారు. పౌరుల భద్రత, శాంతి, సమాజంలో నేరాలను నివారించే చర్యలపై ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతి భద్రతలు కాపాడే విధంగా పోలీస్ సిబ్బంది అధిక కృషి చేయాలని ఆమె ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, నేరాలను అరికట్టడం లక్ష్యంగా మున్ముందుమరింత కఠినచర్యలు తీసుకుంటామనిఎస్పీ తెలిపారు.

పరోపకారమే జీవిత పరమావధి

◆ యూనివర్సిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. కె. ప్రవీణ

మొక్క నాటుతున్న ప్రొ॥ కె. ప్రవీణ

జడ్చర్ల, మార్చి 18 ప్రభాతవార్త : స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లు గతవారం రోజులుగా జరుగుతున్న ప్రత్యేక క్యాంప్ మంగళ వారంతో ముగిసింది. ముగింపు వేడుకలకు పాలమూరు విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొ.కె. ప్రవీణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆమెకు పర్యా వరణ హిత బొకేతో స్వాగతం పలికిన వాలంటీర్లు అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ డా.సదాశివయ్య ఆధ్వర్యంలో మొక్క నాటిం చారు. అనంతరం సెమినార్ హాల్ లో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో వాలంటీర్‌లను ఉద్దేశించి ప్రొ. ప్రవీణ మాటాడారు. ఎన్ఎస్ఎస్ వల్ల జీవిత పరమావధి పరోపకారం అని తెలుస్తుంది అన్నారు. ఎన్ఎస్ఎస్ మనకు జీవితంలో వచ్చే క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుందని అంతేకాక అనేక కొత్త విషయాలు తెలిసేలా చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా.నర్మద మాట్లాడుతూ తాను కూడా చదువుకునే సమయంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా ఉన్నానని, క్రమశిక్షణ అలవాటు పడుతుందన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. సదాశివయ్య మాట్లాడుతూ గత వారం రోజుల్లో 50 మంది వాలంటీర్‌లు సుమారుగా రూ. 3.5లక్షల విలువైనపని చేసారని తెలిపారు.గార్డెన్‌ను అద్దంలా తీర్చిదిద్దారని, 12 అడుగుల వెడల్పు, 40 అడుగుల పొడవు, 5 అడుగుల లోతుతో అతిపెద్ద కంపోస్ట్ గుంత తయారు చేసి అందులో గార్డెన్‌లో ఎండిన ఆకులను చెత్త చెదారాన్ని వేశారని తెలిపారు. రాబోయే సంవత్సరంలో గార్డెన్‌కి కావలసిన కంపోస్ట్ దొరుకుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వాలంటీర్‌లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అనంతరం వాలంటీర్‌లకు ముఖ్య అతిథి,ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సర్టిఫికెట్‌లను అందజేశారు.ఈ ప్రత్యేక క్యాంప్‌లోనే గార్డెన్ 5వ్ వార్షికోత్సవ సంబరాలు జరగడం వల్ల గార్డెన్‌ను సుందరంగా అలంకరించారు. ముగింపు సందర్భంగా వాలంటీర్‌లుచేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో 50 మంది వాలంటీర్ లతో పాటు పూర్వ వాలంటీర్‌లు రమాదేవి,సాయికుమార్,స్వామి,రాహుల్‌లు పాల్గొన్నారు.

వింత రోగంతో కోళ్లు మృతి?

వెయ్యిపైగా మృతి చెందిన కోళ్లు

పెబ్బేరు, మార్చి 18 ప్రభాతవార్త: పెబ్బేరు మండలంలో కోళ్ల ఫారం కేంద్రంలో 15 రోజుల కింద 5900 కోళ్ల చిన్నపిల్లలు వదిలారు. రెండు రోజుల నుంచి వరుసగా తెలియని వింత రోగంతో వెయ్యి కోళ్లకు పైగా మృతి చెంద